ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 15 జనవరి 2024 | 5



రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యిలో ఏర్పాటు చేసిన బరి

కాసైయ్!

కత్తులు దూసిన కోళ్లు

సేమ్ సీన్ రిపీట్.. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది జరిగింది. . గత 20 రోజులుగా ఊరూవాడా పోలీసులదీ ఒకటే హడావుడి.. కోడి పందేలు జరగనివ్వబోమంటే జరగనివ్వ బోమంటూ ప్రగల్భాలు.. పోలీసులు ఏమన్నా ఈ ఏడాది పందేల నిర్వాహకులు అంతగా టెన్షన్ పడలేదు.. సమయం చూశారు..ఆదివారం మధ్యాహ్నం సై అంటే సై అంటూ బరిలో దిగారు.. యథేచ్ఛగా కోడిపందేలు పందేలు నిర్వహిస్తున్నారు.. అప్పటి వరకూ హడావుడి చేసిన అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు.. బరికి ఇంత అని వసూలు చేసి చేతులు కట్టుకుని చూస్తున్నారు..

- ఊరూవాడా బరి తెగింపు
- జోరుగా కోడి పందేలు..గుండాట
- 12 గంటల నుంచి యథేచ్ఛగా..
- ప్రేక్షకపాత్రలో పోలీసులు
- బరుల వారీగా వసూళ్లు
- జిల్లాలో వందలాది బరులు
- పిడింగొయ్యిలో టికెట్ రూ.వెయ్యి
- గోపాలపురంలో గొడవ
- చేతులు మారిన రూ.కోట్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పందెం కోళ్ల కత్తులు దూశాయి. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. పోలీసుల హెచ్చరికలు పెడచెవిన పెడుతూ పందెంరాయుళ్ళు సై అంటే సై అంటూ యథేచ్ఛగా పందేలు నిర్వహించారు. భోగి పండుగ రోజైన ఆదివారం మధ్యాహ్నం 12-30 గంటల వరకు పందేలకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదు.అనంతరం పోలీస్, రెవెన్యూ అధికారులు పరోక్ష అనుమతుల్ని మం జూరు చేస్తూ ప్రేక్షక పాత్ర పోషించారు. పందెం ఆడనిచ్చేలేదని ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది పోలీసులు ప్రగల్భాలు పలికిన సంగతి తెలిసిందే. కానీ రాజకీయ నేతలు ఊరుకుంటారా? ఏకంగా గ్రామగ్రామాన పందెం కట్టించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వందలాది గ్రామాల్లో వేలాది కోళ్ల రక్తంచిందించాయి.కోడిపందాలే కాదు. వాటికి తోడు గుండాటలు, పేకాట శిబిరాలు కూడా వెలిశాయి. బరులు వద్ద జూదగాళ్లకు మందు, విందుకు సంబంధించి షాపులు ఏర్పాటు చేసుకోవడానికి కోడి పందేల నిర్వాహకులు వేలంపాట నిర్వహించినట్టు సమాచారం. మందు అమ్మకాలు జోరందుకున్నాయి. కోడి పందేల్లో రూ.కోట్లు చేతులు మారాయి. కోడిపందెం ఒకటి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ సాగింది. దీనికి పై పందాలు అదనం. గుండాటలో కనీసం రూ.50తో మొదలు పెట్టాలి. ఎంతైనా కాయవచ్చు. ఒక్కో ఆటలో రూ.రూ.5 వేల నుంచి 10 వేలకు పైగా పందెం ఉంటుంది. రెండు మూడు నిమిషాల్లో గుళ్ల తిప్పేస్తారు. వేలాది మంది జేబులు ఖాళీ అయ్యాయి. ఈసారి కోడి పందేల నిర్వహణ తీరు కూడా మారింది. గతంలో పందెంను ఎవరైనా ఉచితంగా చూడవచ్చు. ఇవాళ ఉచితంగా చూసే పందేలు ఉన్నాయి. ప్రత్యేక టికెట్‌తో కూడా ఈ సారి పందేలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యిలో ప్రత్యేక బరి ఏర్పాటు చేశారు. పెద్ద టెంట్ వేసి దాని చుట్టూ ఇనుప పెన్సింగ్ ఏర్పాటు చేశారు. పందెం బరి ఏర్పాటు చేసి దాని చుట్టూ కుర్చీలు వేశారు. ఒక వైపు ఎత్తుగా స్టేడియం వేదికలా కట్టి, అక్కడ స్పెషల్ కుర్చీలు వేసి, వీఐపీలకు రిజర్వు చేశారు. ఈ బరిలోకి ఎంటర్ కావాలంటే రూ.1000 టికెట్ తీసుకోవాలి. వీరి కోసం చికెన్ పకోడి వంటివి సెపరేట్‌గా ఏర్పాటు చేశారు. కవలగొయ్యిలో కూడా ఇలానే ఏర్పాటు చేశారు. కానీ కాస్త చిన్నది. ఇక్కడ టికెట్ రూ.500. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి టికెట్లు అమ్మకం మొదలుపెట్టారు. మూడు గంటల దాటాక ఇవన్నీ కిక్కిరిసిపోయాయి. ఒక్కో బరిలో రూ.లక్షల జూద వ్యాపారం జరిగింది. జిల్లాలో మొత్తం రూ.కోట్లలో జూద వ్యాపారం సాగింది. పిడింగొయ్యి బరిలోనే సుమారు 9 టెంట్‌ల వరకూ వేశారు. కొన్ని చోట్ల దూరంగా రాజకీయనేతల ఫెక్సీలు ఏర్పాటు చేశారు. ఎక్కువ చోట్ల వైసీపీ నేతలు బరులు ఏర్పాటు చేయగా, టీడీపీ నేతలు కూడా కొన్నిచోట్ల ఏర్పాటు చేశారు.ఇలా జిల్లాలోని రాజమహేంద్రవరం డివిజన్‌లోనూ, కొవ్వూరు డివిజన్ లోని అన్ని మండలాల్లోనూ పందాలు జోరుగా జరిగాయి. సంక్రాంతికి నాలుగు రోజుల ముందు నుంచీ హడావుడి చేసిన యంత్రాంగం చతికిలపడింది. గోపాలపురంలో పందెంగాళ్ల గొడవ జాతీయ రహదారిపైకి చేరింది. వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దేవరపల్లి పీఎస్ పరిధిలోనూ పందేల జోరు కొనసాగింది. నిడదవోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని డి.ముప్పవరం వెళ్లే దారిలో పక్కపక్కనే మూడు బరులు ఏర్పాటు చేశారు. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో పుణ్యక్షేత్రంలో భారీ బరి సిద్ధం చేశారు. కోలమూరు, కొంతమూరులో కూడా సోమవారం నుంచి పందెం పుంజులు చెలరేగిపోనున్నాయి. ఈ ఏడాది ఎన్నికలు ఉండడంతో అధికార పార్టీ నాయకులు జూదాన్ని గెలుపు అవకాశంగా తీసుకున్నారని తెలుస్తోంది. కోరుకొండ సమీపంలోని బరిని రూ.13లక్షలకు పాడుకొన్ని హైదరాబాద్ వాసులు ఇప్పటికే వ్యాపారం మొదలుపెట్టారు. భోగి పండగ రోజైన ఆదివారం ఉదయం నుంచే పందెం బరులు సిద్ధం చేశారు. రాత్రి వేళల్లో కూడా పందాలు నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంతేకాక కోడిపందాలను చిత్రీకరించ డానికి అనేక చోట్ల ప్రత్యేక కెమేరాలు కూడా ఏర్పాటు చేయడం గమనార్హం.



నల్లజర్లలో పందెం వేస్తున్న నిర్వాహకులు



రాజమహేంద్రవరంలో బరి వద్ద సిద్ధంగా ఉన్న పుంజులు



పోలీసులకు మామూళ్లే..మామూళ్లు..



జిల్లాలో పోలీసులకు ఈ సంక్రాంతి పండుగ భలే పండుగ. పందెం నిర్వాహకులు పెద్ద పందేలకు రూ.లక్ష వంతున, చిన్న పందేలకు రూ.50 వేలు వంతున పోలీసులకు ముడుపులు చెల్లించినట్టు ప్రచారం జరుగుతోంది. పందాలు ఆడనిచ్చేలేదని పోలీ సులు తెగ ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. రాజకీయనేతల ఒత్తిళ్ల వల్ల చివరకు లొంగిపోయారు.దీంతో డబ్బులు బాగా ముట్టాయి.



గోపాలపురంలో గొడవ

గోపాలపురం, జనవరి 14 : గోపాలపురంలో నిర్వహిస్తున్న కోడిపందెల్లో ఆదివారం ఇద్దరు యువకుల మధ్య చెలరేగిన వివాదం ముదిరి తీవ్ర ఘర్షణకు దారి తీసింది. ఇద్దరు యువకులు కోడిపందేలపై కాచుకున రూ.200తో మొదలైన వివాదం యువకులు సంమయమనం కోల్పోయి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.ఆ వివాదం పెరిగి పెద్దదై జాతీయ రహదారి పైకి చేరింది. భారీగా జనం గుమిగూడడంతో జాతీయ రహదారి పై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనాలు బారులుతీరాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఎస్ఐ కే.సతీష్‌కుమార్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గుమిగూడిన జనాన్ని చెదరగొట్టారు.వాహనాలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వివాదానికి కారణమైన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆనందం నిండుగా.. భోగి పండుగ



ఆదివారం తెల్లవారుజాము నుంచే సంక్రాంతి వచ్చేసింది..ఊరూవాడా సందడి తెచ్చేసింది.. వేకువజామునే భోగిమంట వేసేందుకు యువత సన్నద్ధమైపోయారు. ఎక్కడెక్కడి నుంచో తెచ్చిన పుల్లలతో వీధివీధినా పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు.చిన్నారులు తమ ఎత్తు భోగిపిడకల దండలు పట్టుకుని మంటల వద్ద క్యూకట్టారు.. భోగభాగ్యాలను తేవాలని భోగి పండుగను ఆనందం నిండుగా నిర్వహించారు.. మహిళలు సంక్రాంతి లక్ష్మిని పిలుస్తూ ఇళ్ల ముందు ముగ్గులతో అలంకరించారు.



ఆగని పోరు : బిక్కవోలులో ఎస్మా చట్టం ప్రతులు, షోకాజ్ నోటీసులను భోగిమంటల్లో వేస్తున్న అంగన్‌వాడీలు

ముగిసిన ధనుర్మాసం ఉత్సవాలు

ఘనంగా గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం

కోరుకొండ, జనవరి 14 : ధనుర్మాస మహోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ధనర్మాసం ఆరంభం నుంచి గత 30 రోజులుగా వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తిరుప్పావై పారాయణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.ధనుర్మాసోత్సవాలు ఆదివారం ముగియడంతో గోదారంగనాథుల కల్యాణోత్సవాలు నిర్వహించారు.ధవళేశ్వరం జనార్దనస్వామి ఆలయం, కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం, ఆర్యవైశ్య కోదండ రామాలయం,పశ్చిమగోనగూడెం గీతామిషన్‌లో కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై కల్యాణోత్సవాలను తిలకించారు. స్వామి అమ్మవార్లకు పలువురు భక్తులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు కల్యాణ అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైష్ణవ ఆలయాలు ఉదయం నుంచి భక్తజనంతో కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు.



దేవరపల్లిలో గోదారంగనాథుల కల్యాణోత్సవం



సంక్రాంతి 'పల్లె పులకింత'

- పల్లెకొచ్చిన పెద్ద పండుగ.. ● పట్టణాలు ఖాళీ.. గ్రామాల్లో కళ కళ ● గ్రామాలకు నగరవాసుల పరుగులు
- ఉరుకుల పరుగుల జీవనానికి కాస్త బ్రేక్.. ● నాలుగు రోజుల ఆనందం కోసం ఎగిరొచ్చిన బంధుగణం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పల్లె వాకిళ్ల పులకరించే రోజు.. నగరవాసులు పుట్టిపెరిగిన మట్టి వాసన గుండెనిండా నింపుకొనే రోజు, సహవాసగాళ్లతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని మనసు తేలిక చేసుకునేరోజు, ఆడాళ్ల కష్టసుఖాలు పంచుకొనే రోజు.. పిన్నీ, మామ, తాత అంటూ పిల్లలు ఇల్లంతా గోల చేసే రోజు.. బావను ఆట పట్టించే మరదళ్లు.. తొడగొట్టే పందెం పుంజు.. మతిపోగొట్టే పడతుల అందాలు.. కొత్త అల్లుళ్లు.. అత్తవారి వంటకాలు.. మామగారి మర్యాదలు.. అమ్మమ్మ ఆశీస్సులు.. తాతయ్య మొట్టికాయలు.. ఒకటేమిటి పట్టణాల పరుగుల జీవనంలో కోల్పోయే మమకారం, ఆప్యాయత, అనురాగం, ఓదార్పు, మనశ్శాంతిని మూడురోజుల్లో మళ్లీ రీచార్జ్ చేసే రోజు సంక్రాంతి. ఈ ఏడాదీ ఆ ఉత్సాహం పల్లెలకు ఉరుకుల పరుగున వచ్చేసింది. పల్లె ఒడిలో కల్మషం లేకుండా దొరికే కలగలుపు కూర కోసం అను బంధాలు రెక్కలు కట్టుకుని వాలిపోయాయి. భోగి రోజున అర్ధరాత్రి నుంచే భోగి మంటలను వెలిగించారు. చిన్నారుల తలపై భోగి పళ్లు పోసి మురిసిపోయారు. భోగి రోజున బంధువులు కొందరు చేరుకోవడం ఆలస్యమైనా సంక్రాంతికి బాంధవ్యం చెంత చేరిపోయారు. డూడూ బసవన్నలు, హరిదాసులు, గొబ్బెమ్మలు, అరిసెలు, పొంగడాలు, జంతికలు, కజ్జికాయలు ఆశ్చర్యంగా చూస్తూ ఈ తరం పిల్లలు వాటి తెలుగు పేర్లను సెల్‌ఫోన్‌లో ఇంగ్లీషులో తర్జుమా చేసుకొని తెలుసుకోవడంలో బిజీ అయిపోయారు. బావా బామ్మర్దులు, అన్నాదమ్ములు.. ఇలా పందెం పుంజులను యుద్ధాలకు తీసుకెళ్లడానికి సిద్ధమైపోయారు. పల్లె వాకిళ్ల గంగిరెద్దులు తొక్కడం కోసం గొబ్బెమ్మలను సిద్ధం చేసుకున్నాయి. ఇంకేముంది పట్టణాలు బోసిపోగా.. పల్లెల్లో సంక్రాంతి సందడి ఉట్టిపడుతోంది. పండుగ శోభ పరవశింపజేస్తోంది.

● సంబరాల కోసం పరుగున

అన్ని పండుగల్లో సంక్రాంతి పండుగ భిన్నమైనది. వినాయకచవితి, కృష్ణాష్టమి, దీపావళి మాదిరిగా కాకుండా సంక్రాంతి పూర్తిగా సంబురాల పండుగ. ముఖ్యంగా ఐదేళ్ల నోట్లోకి వెళ్లడానికి కారణమైన పంట పొలాలు, పశువులకు కృతజ్ఞతలు తెలుపుకొనే గొప్ప రోజు. పల్లె రుణం తీర్చుకొనే రోజు. అందుకే భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ ఈ నాలుగు రోజులూ సరదా సంతోషాలకే ప్రాధాన్యం ఉంటుంది. ఏడాదంతా ఉరుకులతో గడిపే పట్టణవాసానికి ఏడాదికి మూడు రోజులు సెలవిచ్చి ఈ ఉల్లాసం కోసం ఉత్సాహంగా సొంతూళ్లకు.. పల్లెల్లోని బంధువుల ఇళ్లకు పరుగున వచ్చేస్తారు. ఒకరకంగా తెలుగువారింట ఈ పెద్ద పండుగ బంధాలకు కావలి కాస్తుందంటే అతిశయోక్తి కాదు.

● ఎలాగైనా వెళ్లి రావలె..

రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్, బస్సుల్లో జాగా లేదు, విమానంలో సీట్లు లేవు, హైవేపై కార్ల క్యూ.. అయినా.. ఎలాగైనా వెళ్లి రావలె.. అదే సంక్రాంతి గొప్పతనం. సంక్రాంతి వచ్చిందంటే ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో సందడి మాటల్లో చెప్పేది కాదు. కన్నుల పండువను కళ్ల ముందుకు తెస్తోంది.



అందువల్ల జీవనోపాధికి ఎంత దూరంలో ఉన్నా సంక్రాంతికి సొంతూరుకు చేరుకోవాల్సిందే. మూడు రోజులూ బంధువులతో ఎంజాయ్ చేయాల్సిందే. దీంతో కాస్త కష్టం అనుభవించి నా పల్లెకు చేరుకున్నాక ప్రయాణ బడలికను పండుగ సరదాల్లో కలిపేస్తున్నారు. పండుగకు రెండు మూడు నెలల నుంచే రైళ్లకు రిజర్వేషన్ చేయించుకున్నా కిక్కిరిసిన ప్రయాణికుల్లో ఇబ్బందులు పడుతూనే పల్లెబాట పట్టారు. పండుగకు ఎక్కువగా హైదరాబాద్ నుంచి గోదావరి జిల్లాలకు వస్తుంటారు. అక్కడ స్థిరపడిన గోదారోళ్లు పెద్ద పండక్కి అరు నూరైనా.. నూరు నూటపాతికైనా వచ్చి వెళ్లాల్సిందే. ప్రత్యేక రైళ్లు వేసినా.. ఆర్టీసీ సుమారు 60 ప్రత్యేక బస్సులను నడిపినా.. ప్రైవేటు ట్రావెల్స్ టికెట్ ధరలు బాదేసినా.. తిప్పలు పడుతూనే సొంతూళ్లకు వచ్చేశారు. అటు విమానాల్లో కూడా టికెట్లు దొరకని పరిస్థితి ఉన్నా 'తగ్గేదేలె' అంటూ రెక్కలు కట్టుకొని వాలిపోయారు. దీంతో పల్లె తనవాళ్లను చూసి మురిసిపోతోంది.

● సంక్రాంతి నూతన కాంతే కదా!

సంప్రదాయాలు, ఆచారాల్లో భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఇమిడి ఉంటాయని పెద్దల ఉవాచ. సంక్రాంతి అంటే నూతన కాంతి అని అర్థం. పంటలు చేతికొచ్చి గాదెలు ధాన్యంతో కళకళలాడే వేళ. సంక్రాంతిలో నిగూఢంగా ఉన్న మర్మాలు ఉన్నాయి. ఛాందసత్వాన్ని పక్కపెట్టి శాస్త్రీయంగా అర్థం చేసుకుంటే ఆ అంతరార్థాలు ఏమిటో అనుభవపూర్వకంగా తెలుసుకోవచ్చని ఆ తరం వారు హితబోధ చేస్తున్నారు. ఉరుకుల పరుగుల ఆధునిక జీవనంలో.. ఫోనులో ముఖాలను చూసుకుంటూ పలకరింపుల జీవితంలో అసలే బంధాలు పలుచబడిపోయాయనేది ఏవరూ కాదనలేని వాస్తవం. పిల్లలకు చుట్టాలు ఎవరో, ఎవరు వరుసకు ఏమవుతారో తెలియదు. అప్పుడప్పుడు లేదా ఎప్పుడో ఒకసారి ఫోనులో మాట్లాడుకోవడం మినహా మనసులోని మాటలను నేరుగా పంచుకున్నదీ లేదు. దీంతో సంక్రాంతి లేకుంటే అసలే అంతంత మాత్రంగా ఉన్న బంధాలు కాలగర్భంలో కలిసిపోయేవేనని పెద్దలు పడే బాధకు పెద్ద పండుగ కాస్త సాంత్వన చేకూరుస్తోంది. పెద్ద పండుగకు ఇల్లు శుభ్రం చేసుకోవడం.. అనవసరమైన వస్తువులను వదిలించుకోవడం ప్రధానమైనది. మూడు నాలుగు రోజుల నుంచే.. ఒక్కో ఇంట్లో నెల రోజుల నుంచే పండుగ పనులు మొదలు పెడతారు. ఏడాదికి ఒకసారి మెగా స్వచ్ఛభారత్ అన్నమాట. ఇప్పటి తరం వాళ్లకు ముగ్గులంటే తెలియదు. ఒకవేళ అడిగితే రుచి ఎలా ఉంటుందని ఎదురు ప్రశ్నించినా ఆశ్చర్యపోనవసరం లేదు. గతంలో లోగిళ్లలో వేసే ముగ్గురు మహిళలకు సహజ వ్యాయామంగా ఉండేవి. కూర గుమ్మడి కాయ సాధారణంగా అధికశాతం మంది విని యోగించరు. కానీ సంక్రాంతి కలగలుపు కూరలో గుమ్మడి ఉండా ల్సిందే. గుమ్మడి పోషకాల గని అని వైద్యశాస్త్రం చెబుతోంది. సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఆవులు, గేదెలకు సెలవు వచ్చినట్లే. ఏడాదంతా పశువులు చాకిరీ చేసి ఇల్లు గడవడంలో తోడ్పడతాయి. వాటికి కృతజ్ఞతలు చెప్పుకొనే గొప్పరోజు సంక్రాంతి. అందుకే కనుమ రోజున కాకైనా కదలదనే నానుడి ఉండనే ఉంది. పితృదేవతలను స్మరించుకోవడం సంక్రాతి రోజున అధికశాతం మంది ప్రధానంగా ఆచరిస్తారు. జనసామాన్యంలో మూలన పెట్టుకోవడం అంటారు. కొత్త వస్త్రాలు, పిండివంటలు, కూరగాయలు తదితర పదార్థాలు వారికి నివేదించుకోవడంతో పండుగను ప్రారంభిస్తారు. కోడి పందేలకు తరతరాల చరిత్ర ఉంది. ఒకప్పుడు కత్తులు వాడేవాళ్లు కాదు. కానీ రానురాను కత్తులు కడితేనే కోడిపందేలు అన్నట్లుగా పరిస్థితి పశుహింసకు దారితీసింది. కత్తులు కట్టి, డబ్బులు పెట్టి జూదంగా మార్చేశారు. ఒకప్పుడు ఇద్దరు మనుషులు లేదా ఊళ్ల మధ్య వివాదాలు ఏర్పడితే కోడి పందెం ద్వారా పరిష్కారం చూపే వారు. పౌరుషానికి ప్రతీకగా కోడి పందేలను చూసేవారు. పల్నాటి కాలంలో మాచర్ల, గురజాల జరిగిన గొడవ యుద్ధానికి దారితీయగా పెద్దలు కోడి పందెం ద్వారా సమస్యను పరిష్కరించారని చరిత్ర చెబుతోంది. ఏడాదంతా అమ్మగారింటికి రాకపోయినా సంక్రాంతికి కచ్చితంగా ఆడపిల్లలు పుట్టింటికి వస్తారు. భర్త, ఆయన తరపు వారు కూడా ఈ పండుగ రోజున వాళ్లకు అడ్డుచెప్పరు. అందుకే అత్తవారిల్లు అల్లుడు, కూతురు, పిల్లలతో మూడు రోజులూ కళకళలాడుతుంది.ఇలా భోగి పండ్లు(రేగు), గొబ్బెమ్మలు, హరిదా సులు, గంగిరెద్దులు, గాలిపటాలు.. ఇలా సంప్రదాయంలో దాగి ఉన్న ఆరోగ్య జీవన విధానానికి అవసరమైన ఎన్నిటినో సంక్రాంతి పండుగ మనకు దూరం కాకుండా చేస్తోంది. ముఖ్యంగా పిల్లలు.. భావితరాలు.. బంధాలకు దూరం కాకుండా పహారా కాస్తోంది.

ఓ రోజు ముందుకు సంక్రాంతి

ఎవరైనా గమనించారా!.. సంక్రాంతి పండుగ ఓ రోజు ముందుకు జరిగింది. జనవరి 14న వచ్చే పండుగ 2008 నుంచీ జనవరి 15న వస్తోంది. ఎందుకంటారా?.. దీనికో కారణం చెబుతున్నారు జ్యోతి ష్కులు. సూర్యుడి ప్రతి ఏడాదీ మకర సంక్రమణం చేసిన రోజున సంక్రాంతి జరుపుకుంటాం. సంక్రాంతి అంటే నూతన కాంతి. ఇలా జరిగే క్రమంలో ప్రతి ఏడాదీ 20 నిమిషాలు ఆలస్యం అవుతుంది. స్థూల గణన చేస్తే మూడేళ్లకు ఒక గంట, 72 ఏళ్లకు ఒక రోజు అవుతుంది. అందువల్ల ప్రస్తుతం జనవరి 15కి జరిగింది. 1935 నుంచీ 2007 వరకూ 72 ఏళ్ల పాటు జనవరి 14న సంక్రాంతి జరుపుకున్నారు. 2008 నుంచి 2080 వరకూ 15న సంక్రాంతి వస్తోంది. 2081 నుంచి 2153 వరకూ మరోరోజు ముందుకు జరిగి 16న ఈ పండుగ జరుపుకుంటారని చెబుతున్నారు.



కొత్తపేటలో సంక్రాంతి ప్రభల ఊరేగిస్తున్న దృశ్యం(ఫైలు)

కొత్తపేటలో నేడు ప్రభల ఉత్సవం

కొత్త పేట, జనవరి 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో సోమవారం జరిగే సంక్రాంతి ప్రభల ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రం నలుమూలలు నుంచి లక్షలాదిగా సందర్శకులు రానున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీలు, అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా మకర సంక్రాంతి రోజున సూర్యుడు మకర రాశిలో ప్రవేశించినప్పుడు ప్రభల ఉత్సవం జరపడం ఇక్కడ అనాదిగా వస్తోంది. ప్రభల ఉత్సవం మూడు ప్రధాన వీధుల మధ్య పోటాపోటీగా సాగుతోంది. ముందుగా పాత రామాలయం మునసుబు గారి ప్రభ వీరభద్రుని అలంకరించుకుని పురవీధుల్లోకి ప్రవేశిస్తుంది. వాటిని అనుకరిస్తూ మిగిలిన విధుల ప్రభలు సాంస్కృతిక ప్రదర్శన మధ్య ఊరేగింపుగా బయల్దేరుతాయి. బోడిపాలెం ప్రభ భక్తఆంజనేయునిగా అలంకరించుకుని రెండో ఊరేగింపు ప్రారంభమవుతుంది. కొత్తరామాలయం ప్రభ రాజరాజేశ్వరిదేవిగా అలంకరించుకుని ఆయా వీధుల ప్రభలను వెంట బెట్టుకుని మూడవ ఊరేగింపు మొదలవుతుంది. మొత్తం మూడు ఊరేగింపులు కొత్తపేట ఉన్నత పాఠశాల మైదానంలోకి చేరుకుని భక్తుల సందర్శనార్థం కొలువై ఉంటాయి. బాణసంచా పోటాపోటీ కాల్పులు చూపరులను కట్టిపడేస్తాయి. తిరిగి రాత్రి పదకొండు గంటలకు ప్రభల ఊరేగింపు పురవీధుల్లో వివిధ సంస్కృతిక ప్రదర్శనల నడుమ తెల్లవారుజామున నాలుగు గంటలకు పాతబస్టాండు సెంటరుకు చేరుకుంటుంది. పాత, కొత్త రామాలయం వీధుల మధ్య పోటాపోటీ బాణసంచా కాల్పులతో ప్రభల ఉత్సవం ముగుస్తుంది. అమలాపురం ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో 500 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

రత్నగిరిపై సంక్రాంతి సంబరాలు

- వేడుకలు ప్రారంభించిన తపోవనం స్వామీజీ



రత్నగిరిపై సంక్రాంతి సంబరాలు ప్రారంభిస్తున్న తపోవనం సచ్చిదానంద స్వామీజీ

అన్నవరం, జనవరి 14: సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. వేకువజామున 5గంటలకు స్వామి,అమ్మవార్లను మేళతాళాలతో వార్షిక కల్యాణవేదిక వద్దకు తోడ్కొని వచ్చారు. తపోవనం సచ్చిదానంద స్వామీజీ ప్రత్యేకపూజలు నిర్వహించి భోగిమంట వెలిగించి సంక్రాంతి సంబరాలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎడ్లబండి, దాన్యపురాసులు, కుమ్మరిచక్రం, బొమ్మలకొలువు, సంక్రాంతి పిండివంటలు, తాటిచెట్టు, ఈతచెట్టు ఏర్పాటు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పల్లెటూరు వాతావరణం ప్రతిభింభించే విధంగా ఏర్పాట్లుచేసిన ఈవో రామచంద్రమోహన్‌ను పలువురు అభినందించారు. స్వామివారి దర్శనానికి విచ్చేసిన పట్నం భక్తులకు ఆలయప్రాంగణం వద్ద ఏర్పాటుచేసిన పల్లెటూరు వాతావరణం తిలకించి ఆనందించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన కళాకృతులు వద్ద స్వీయచిత్రాలు తీసుకున్నారు.

అంతర్వేదిలో కలెక్టర్ దంపతుల పూజలు



కలెక్టరు హిమాన్షు శుక్లా దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఏసీ

అంతర్వేది, జనవరి 14: బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి ఆదివారం కాకినాడ, కోనసీమ జిల్లాల కలెక్టర్లు హిమాన్షు శుక్లా, కృతికా శుక్లాలు కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి అంతరాలయంలో దర్శనం నిర్వహించి వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. కలెక్టర్ దంపతులకు ఆలయ ఏసీ సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు.

ఘనంగా భోగి పండుగ

- ద్రాక్షారామలో 800 అడుగుల భోగి పిడకల దండ



ద్రాక్షారామలో 800 అడుగుల భోగిపిడకల దండతో కోటిపల్లి కుటుంబ సభ్యులు

ద్రాక్షారామ, జనవరి 14: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపు రం మండలం ద్రాక్షారామకు చెందిన కోటిపల్లి సత్యనారాయణ, కోటిపల్లి లోవరాజు, కోటిపల్లి రాజు సోదరులు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా పిల్లా పాపలతో కలసి సమీపంలో ద్రాక్షారామ భీమేశ్వరాలయం వద్ద భోగిమంటలో 800 అడుగుల భోగిదండ వేశారు.

ఏడువేల భోగి పిడకలతో ..



పిఠాపురంలోని కోటగుమ్మం సెంటర్‌లో ఏడువేల భోగిపిడకల దండతో..

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం కోటగుమ్మం సెంటర్‌లో ఉన్న జైగణేష్ దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోగి మంట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భోగిమంట చుట్టూ పుష్పాలు, ముగ్గులు, మామిడితోరణాలు, కొబ్బరి ఆకులతో సంప్రదాయబద్ధంగా అలంకారం చేశారు. భోగిమంటల్లో ప్రత్యేకంగా తయారు చేయించిన ఏడువేల భోగిపిడకల దండను తెచ్చి వేశారు. అనంతరం చిన్నారులకు భోగిపళ్లు వేసి ఆశీర్వాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మైలవరపు రామకృష్ణ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు జరుగగా, కమిటీ ప్రతినిధులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

గుమ్మిలేరులో భోగిదండ ఊరేగింపు..

ఆలమూరు: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరులో ఉరదాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 600మీటర్ల భోగి దండ తయారు చేశారు. ఆదివారం దానిని మంగళ వాయిద్యాల నడుమ భారీగా ఊరేగించి గుమ్మిలేరు సెంటర్లో ఏర్పాటు చేసిన భోగి మంటలో వేశారు. ఊరేగింపులో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంక్రాంతి సంప్రదాయలను పరిరక్షించాలనే ఉద్దేశ్యంతో ఏడు సంవత్సరా లుగా భారీ భోగి దండలు తయారు చేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ ఈదల శ్రీనివాస్ తెలిపారు.



ఆలమూరు: గుమ్మిలేరులో భారీ భోగిదండను ఊరేగిస్తున్న ఉరదాలమ్మ ఆలయ భక్తులు

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం

- వేలాది తరలివచ్చిన భక్తజనం




గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, జనవరి 14: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో భోగి సందర్భంగా గోదా రంగనాథుల దివ్య కల్యాణాన్ని వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణ నడుమ ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రాహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు కల్యాణాన్ని జరిపించారు. వివాహం కాని యువతీ, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈవో ముదునూరి సత్యనారాయణరాజు-హైమా పార్వతి దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొనగా ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు స్వామివారి ప్రసాదం పంపిణీ చేశా రు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలపుతూ ఏర్పాటుచేసిన ఫల, పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. అయోధ్య రామమందిరం చూద్దాం రండి ఫొటో షూట్ వద్ద భక్తులు సందడి చేశారు. మహారాష్ట్రకు చెందిన పూణే కళాకారుల డ్రమ్స్, కేరళ కళాకారుల గరుడ వేషాలు, తమిళనాడుకు చెందిన తాంబులం వాయిద్య కళాకారుల ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

పోటా పోటీగా బాస్కెట్ బాల్ పోటీలు

రామచంద్రపురం, జనవరి 14: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు జాతీయ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో 13వ ఆలిండియా, 19వ ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ సెమీ ఫైనల్స్ పోటీలు ఆదివారం పోటాపోటీగా జరిగాయి. ఈపోటీల్లో సెయింట్స్ జట్టుపై గుంటూరు జట్టు, అనంతపురం జట్టుపై బీఎస్‌ఏ కాకినాడజట్టు, వైజాగ్ జట్టుపై మార్టేరు జట్టు విజయం సాధించాయి. అలాగే రాజమండ్రి సీబీఏ జట్టుపై ఖమ్మం జట్టు, అమలాపురం జట్టుపై రామచంద్రపురంజట్టు, రాజమండ్రి సీబీఏ జట్టుపై హైదరాబాద్ డీబీఏ జట్టు, గుంటూరు జట్టుపై ఆక్టేరి జట్టు గెలుపొందాయి. సోమవారం ఫైనల్స్ పోటీలు జరుగుతాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి తెలిపారు. పట్టణ ప్రముఖ డాక్టర్ చెలికాని స్టాలిన్, క్రీడాకారులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో బాస్కెట్‌బాల్ పోటీల్లో తలపడుతున్న జట్లు

మహాసంస్థానంలో విదేశీ భక్తుల పూజలు

- స్పానిష్ భాషలోకి శ్రీపాదశ్రీవల్లభ చరితామృతం



స్పానిష్ బాషలోకి అనువదించిన శ్రీపాద శ్రీవల్లభ చరితామృతం పుస్తకాన్ని ఆలయానికి అందజేస్తున్న స్పెయిన్, స్విట్జర్లాండ్ దేశాల భక్తులు

పిఠాపురం, జనవరి 14: కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని ఆదివారం పలువురు విదేశీ భక్తులు సందర్శించారు. స్పెయిన్, స్విట్జర్లాండ్ దేశాలకు చెందిన భక్తులు శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి అర్చకులు వివరించారు. ఈ సందర్భంగా వారు స్పానిష్ బాషలోకి అనువదించిన శ్రీపాదశ్రీవల్లభ చరితామృతం పుస్తకాలను మహాసంస్థానానికి సమర్పించారు. విదేశీ భక్తులను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డెం జనార్ధనరావు, కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్యలు ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామివారి చిత్రపటాలు, ప్రసాదాలు అందజేశారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, మరాఠీ తదితర భాషలతోపాటు పలు దేశీయ భాషల్లో ముద్రించిన విశేష ప్రాచుర్యం పొందిన శ్రీపాదశ్రీవల్లభ చరితామృతం పుస్తకం తొలిసారి విదేశీ భాషలోకి అనువదించబడిందని ఆలయ వర్గాలు తెలిపాయి.

ఎక్కడో మారుమూల

పేకాడితే పట్టుకుంటారా?

- కోడిపందాలు, గుండాటలకు మాత్రం అనుమతులా
- సామర్లకోట పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి వీరంగం



పోలీస్ స్టేషన్ వద్ద వీరంగం చేస్తున్న యువకుడు

సామర్లకోట, జనవరి 14: కాకినాడ జిల్లా సామర్లకోట పోలీసుస్టేషన్ ఎదుట ఒక యువకుడు మద్యం మ త్తులో ఆదివారం వీరంగం చే శాడు. మండల పరిధిలో కోడిపందాలు, గుండాటలను అనుమతించిన పోలీసులు తాను పేకాడుతుండగా పోలీ స్టేషన్‌కు తీసుకొచ్చి సామ ర్లకోట పోలీసులు తనను నిర్బంధించడం పట్ల పోలీసుస్టేషన్ ఎదుట అలజడి సృష్టించాడు. చొక్కా విప్పుకు ని బ్లేడ్‌తో పొట్టపై కోసుకుంటూ పోలీసులను దుర్భాషలాడుతూ 20నిమి షాలపాటు హల్‌చల్ చేసి ఒక దశలో రోడ్డుపై ఉన్న రాళ్లనుతెచ్చి పోలీ సుస్టేషన్‌పైకి విసిరికొట్టాడు. మండలంలో కోడిపందాలు, గుండాటలు జోరుగా జరుగుతున్న ప్పటికీ ఎక్కడో మారుమూల పేకాడుతున్న తనను ఎందుకు నిర్బంధించారంటూ పోలీసులపై తీవ్రమైన స్వరంతో ప్రశ్నల వర్షం కురిపించాడు. అన్ని ఆటలు పట్టించండి అంటూ నినాదాలు చేశాడు. ఆ సమయంలో సదరు యువకుడిని నివారించేందుకు స్టేషన్‌లోఉన్న పోలీసులు అంతగా సాహ సించలేదు. కొద్దిసేపటి తర్వాత స్టేషన్ బయటే అతడిని కూర్చొబెట్టారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్


- భార్య, పిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోయారని మనస్తాపం



పిఠాపురంలో సెల్‌టవర్ ఎక్కిన వ్యక్తి

పిఠాపురం, జనవరి 14: కాకినాడజిల్లా పిఠాపురంలోని అగ్రహారంలో సెల్‌టవర్ ఎక్కి ఒక వ్యక్తి హల్‌చల్ చేశాడు. పిఠాపురం మండలం కందరాడ గ్రామానికి చెందిన పిల్లా దుర్గారావుకు, అతడి భార్యకు ఇటీవల గొడవ జరిగింది. దీంతో పిల్లలను తీసుకుని భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. భార్య తనను వదిలి వెళ్లిపోయిందని మనస్తాపానికిగురైన దుర్గారావు సెల్‌టవర్ ఎక్కాడు. భార్య తిరిగి కాపురానికి వస్తేనే తాను దిగుతానని మొండికేశాడు. అక్కడకు చేరుకున్న పిఠాపురం పట్టణ ఎస్‌ఐ మురళీమోహన్ దుర్గారావుతో చర్చించి కిందకు దింపి పోలీసుస్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదానికి గురైన కర్రి అర్జునరావు

గండేపల్లి, జనవరి 14: కాకినాడజిల్లా పెద్దాపురం మండలం నీలాద్రిపేట గ్రామ శివారులో ఆసుపత్రి జంక్షన్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నీలాద్రిపేట గ్రామానికి చెందిన కర్రి అర్జునరావు(45) మృతి చెందాడు. స్థానిక పోలీసుల సమాచారం ప్రకారం... అర్జునరావు తన సొంత గ్రామం నుంచి పిండి ఆడించేందుకు జగ్గంపేట వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఆదిత్య జంక్షన్ వచ్చేసరికి రోడ్డు దాటుతున్న సమయంలో రాజమండ్రి నుంచి జగ్గంపేట వైపు వెళ్లే లారీ అతడి బైక్‌ను ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం కాగా జగ్గంపేట ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు చనిపోయినట్టు డాక్టర్ ఇచ్చిన రిపోర్టుపై గండేపల్లి ఎస్‌ఐ ఎం.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కందుల దుర్గేష్ సతీమణి అంత్యక్రియలు పూర్తి

- పలువురు ప్రముఖుల పరామర్శ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 14: జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ సతీమణి అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. అనారోగ్యం కారణంగా ఆమె శనివారం మృతి చెందిన విషయం విదితమే. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని నివాసం నుంచి ఆమె పార్థివదేహాన్ని ఉదయం 10గంటలకు ఇన్నీసుపేట కైలాస భూమికి తరలించారు. అక్కడ అంత్యక్రియలను దుర్గేష్ తనయుడు డాక్టర్ తేజ పూర్తి చేశారు. తొలుత ఉషారాణి పార్థివదేహాన్ని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీఉండవల్లి అరుణ్‌కుమార్, ఎంపీలు మార్గాని భరత్‌కుమార్, పిల్లి సుభాష్ చంద్రబోస్, డాక్టర్ గూడూరి శ్రీనివాసరావు, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, జనసేన కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ.రామారావు, నగర అధ్యక్షుడు వై.శ్రీను, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, కనకాల రాజా, చేరుకూరి వెంకట రామారావు సందర్శించి నివాళుర్పించారు. దుర్గేష్‌ను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ ఆయన కుమారుడు డాక్టర్ తేజను పరామర్శిస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి



ప్రత్తిపాడు, జనవరి 14: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్‌లో 16వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తూర్పుగోదావరిజిల్లా రంగంపేటకు చెందిన గాజువిల్లి శ్రీను అతడి భార్య అపర్ణ(19) మోటార్‌బైక్‌పై బంధువుల ఇంటికి ప్రత్తిపాడు మండలం రాచపల్లి బయల్దేరారు. ప్రత్తిపాడు ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్‌వద్ద కంటైనర్ లారీ వేగంగా ఢీ కొనడంతో బైక్‌పై వెనుక కూర్చున్న అపర్ణ అక్కడికక్కడే మృతి చెందింది. పండుగపూట అమ్మమ్మ ఊరు వెళుతున్న అపర్ణ మృత్యువాత పడడంతో కుటుంబీకులు తీవ్రవిషాదంలో మునిగిపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రత్తిపాడు ఎస్‌ఐ ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేశారు.

ఏజెన్సీ సమాచారం


దీక్షా శిబిరం వద్ద భోగిమంటలు వేస్తున్న అంగన్‌వాడీలు

దీక్షలోనే భోగి పండుగ

కూనవరం, జనవరి 14: అంగన్‌వాడీ కార్యకర్తలు గత కొన్నిరోజులుగా చేస్తున్న దీక్షా శిబిరం వద్దనే భోగిపండుగ జరుపుకున్నారు. తాము న్యాయపోరాటం చేస్తున్న జగన్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు పెంటయ్య, సీపీఎం కార్యదర్శి సీతారామయ్య, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మి, గీత పాల్గొన్నారు.

ఘనంగా భోగి సంబరాలు

మోతుగూడెం, జనవరి 14: చింతూరు మండలం మోతుగూడెంలో అర్ధరాత్రి నుంచి గ్రామస్థులు భోగి మంటలు వేశారు. భోగి మంటలోని భోగి పిడకలు వేసి పూజలు చేశారు. చిన్నారులకు తమ ఇళ్లల్లో భోగి పండ్లు వేశారు. ప్రతి ఒక్కరు సంతోషంగా పండుగను చేసుకున్నారు.

దేవీపట్నం: మండలంలోని అన్ని గ్రామాలలో భోగిమంటల వద్ద పిల్లలుపెద్దలు అందరూ సందడి చేశారు. కొత్త అల్లుళ్లతో బంధువులు రావడంతో సందడి నెలకొంది. మండలంలో ఇందుకూరుపేటలో అమ్మ స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ కుంజం మురళి హాజరయ్యారు. అమ్మస్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు గారపాటి సతీష్‌నాయుడు వరలక్ష్మి దంపతులకు అభినందనలు తెలిపారు. ముగ్గుల పోటీలలో గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గారపాటి మురళికృష్ణ, నానిమాస్టార్, పిడుగు శ్రీమూర్తులు, గారపాటి బాబురావు, బేబీ పాల్గొన్నారు.

పొల్లూరు యూత్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

మోతుగూడెం, జనవరి 14: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు గ్రామంలో పొల్లూరు యూత్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గత పాతికి సంవత్సరాల నుంచి ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని పొల్లూరు గ్రామవాసులు తెలిపారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ ఆకేటి సీత, స్పోర్ట్స్ ఏఈ పవన్, సివిల్ ఏఈ పవన్ ఇరుజట్లను అభినందించారు. అనంతరం మ్యాచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సాయి సుశీల, ఈశ్వర్ కైలాస్‌రెడ్డి, విశ్వనాథ్, జోసెఫ్, ప్రసాద్, పేపకాయల శ్రీను, గోవిందరాజు, రమేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా కెఎన్‌పురం జట్టు


విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న చందు, పుట్టిరమేష్

ఎటపాక, జనవరి 14: కృష్ణవరం గ్రామంలో తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్గీయ ఎన్టీఆర్ మెమోరియల్ మండలస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా కెఎన్‌పురం జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో కృష్ణవరం, కేఎన్‌పురం జట్లు తలపడ్డాయి. కేఎన్‌పురం జట్టు విన్నర్‌గా విజయం సాధించింది. విజేతగా నిలిచిన కేఎన్‌పురం జట్టుకు రూ. 8వేల ప్రైజ్ మనీతో పాటు ట్రోఫీ, మెడల్స్‌ను తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, మండలాధ్యక్షుడు పుట్టి రమేష్, గొమ్ముకొత్తగూడెం ఎంపీటీసీ పాయం దేవీలు అందజేశారు. రన్నర్ జట్టుకు రూ.5వేల నగదు అందజేశారు.



బ్యాడ్మింటన్ టోర్నీ విజేత అడ్డతీగల

గోకవరం, జనవరి14: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని రంపయర్రంపాలెం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చిక్కం దొరబాబు అన్నారు. గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిసాయి. ఈసందర్భంగా సీనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా నిఖిల్, వసంత్(అడ్డతీగల), రన్నర్స్‌గా సాయి, వినయ్(ఇందుకూరుపేట) నిలవగా జూనియర్స్ విభాగం (అండర్-19)లో విన్నర్స్‌గా గణేష్, ఉమల, రన్నర్స్‌గా అర్జున్, చరణ్ తేజ్ నిలిచారు. అండర్-12 విభాగంలో విజేతలకు కూడా బహుమతుల అందించారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల రాజు, నవనాసి చలపతిరావు, చిక్కం సతీష్‌బాబు, కర్రి నూకరాజు, పాటి అప్పలరాజు, నందం వెంకటేశ్వరరావు, కాళ్ళ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కీడు తొలగాలి.. ఏపీ వెలగాలి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


బిక్కవోలు: ఇళ్లపల్లిలో ప్రజావ్యతిరేక జీవో ప్రతులను భోగిమంటల్లో వేస్తున్న దృశ్యం

బిక్కవోలు, జనవరి 14: రాష్ట్రానికి పట్టిన కీడు తొలగి ఏపీ వెలగాలంటే మరలా టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. భోగి పండుగ సందర్భంగా ఆయన ఆదివారం రంగాపురం, ఇళ్లపల్లి గ్రామాల్లో భోగిమంటలో వైసీపీ ప్రజా వ్యతిరేక జీవోలను, వైసీపీ నాయకుల చిత్రపటాలను వేసి దహనం చేసి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా వుండాలంటే వైసీపీ పాలన పోవాలన్నారు. అఫై గ్రామంలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఇళ్లపల్లిలో శ్రీధర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నగర, ఉప్పార సాధికార సమితి సభ్యులు కానేటి అప్పలస్వామి, కనుమూరి సాయిరాజు, చిరంజీవిరాజు, జోష్‌బాబు, మణిరాజు, యేసురత్నం, తనుకు శ్రీధర్, అనుసూరి సుబ్బారావు, పి.నాగరాజు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం పాతసోమాలమ్మ ఆలయం వద్ద వేసిన మంటల్లో టీడీపీ నాయకులు వైసీపీ మేనిఫెస్టోను దహనం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన సీఎం జగన్ కీడు పోయి ప్రజల జీవితాల్లో వెలుగు రావాలన్నారు. ప్రభుత్వ జీవోలు, మేనిఫెస్టో ప్రతులను నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణి, కాశి నవీన్‌కుమార్, కుడుపూడి సత్తిబాబు మంటల్లో వేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరం సిటీ: భోగిమంటల్లో ప్రతులను దహనం చేస్తున్న ఆదిరెడ్డి, అనుశ్రీ

ఘనంగా భోగి పండుగ

కడియం/రాజానగరం/కోరుకొండ/రంగంపేట, జనవరి 14: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మొదటి రోజు భోగి పండుగను ఆదివారం గ్రామగ్రామాన ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేకువ జామునే పెద్దలు, చిన్నారులు తలంటు స్నానమాచరించి భోగి మంటలు వేసి, పిడకల భస్మాన్ని నుదుటన ధరించారు. చిన్నారులు భోగి మంటల్లో భోగిపిడకల దండలు వేశారు. సంప్రదాయ దుస్తులు ధరించారు. చిన్నారులకు రేగుపండ్లతో భోగి పళ్లు పోశారు. కుటుంబ సమేతంగా ఆలయాలను సందర్శించి దైవ దర్శనం చేసుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులు, కూతురు-అల్లుళ్లు, కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. పలు గ్రామాల్లో కోడి పందాలు జరిగాయి. కాగా ధనుర్మాసోత్సవం సందర్భంగా రాజానగరంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి గ్రామంలో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అలాగే కడియం నర్సరీలు సందర్శకులతో కిటకిటలాడాయి. ఇతర గ్రామాల నుంచి వచ్చిన వారు నర్సరీలను తిలకించి వివిధ రకాల మొక్కలు కొనుగోలు చేశారు. రంగంపేట మండలం రంగంపేట, కోటపాడు, ఈలకొలను శ్రీసత్య సాయిబాబా మందిరాల్లో బాబా పాదుకులకు, చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. బాలవికాస్ విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.


రాజానగరంలో భోగి మంట వేసిన స్థానికులు


రంగంపేట: కోటపాడులో భోగి మంట వద్ద నమస్కరిస్తున్న చిన్నారులు

ఎందాకైనా పోరాడతాం!

- భోగిమంటల్లో ఎస్మా చట్టం ప్రతులు, షోకాజ్ నోటీసులు
- పండుగైనా ఆగని అంగన్వాడీల ఆందోళన

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 14: మీరేం చేసినా దిగొచ్చేదే లేదు.. ఎందాకైనా వెళతాం అంటూ అంగన్‌వాడీలు భీష్మించారు.. ప్రభుత్వం హెచ్చరికలు చేసినా ఆందోళనలు కొనసాగు తూనే ఉన్నాయి. అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6వ తేదీన ప్రయోగించిన ఎస్మా చట్టం ప్రతులు, అంగన్వాడీలను విధుల నుంచి తొలగిస్తామంటూ ఇచ్చిన షోకాజ్ నోటీసులను అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆదివారం రాజమహేంద్రవరం జాంపేటలో భోగి మంటల్లో దహనం చేశారు. అనంతరం గాంధీ విగ్రహం వరకూ ర్యాలీగా వెళ్లి తమ నిరసన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసన తెలిపారు.సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.శారద, జె.సునీత, యూనియన్ నాయకులు స్రవంతి, పద్మ, దేవి, తాయారు, లక్ష్మి పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చకపోతే ఆమరణ దీక్ష

బిక్కవోలు, జనవరి 14: తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఆమరణ దీక్షలు చేస్తామని అంగన్వాడీల జిల్లా ఉపాధ్యక్షురాలు వి.మార్తమ్మ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బిక్కవోలులో 34 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీల శిబిరాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు సార్లు చర్చలకు పిలిచి కనీస వేతనం ఎంత ఇస్తామన్న విషయం స్పష్టం చేయలేదన్నారు. దీంతో తాము సమ్మె కొనసాగిస్తున్నామన్నారు. తమపై ఎస్మా చట్టం, జీవో-2లను, సమ్మె ఆపకపోతే విధుల నుంచి తొలగిస్తామంటూ నోటీసులు ఇస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ జీవోలన్నింటినీ అంగన్వాడీలు ఏర్పాటు చేసిన భోగిమంటలో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో రంగంపేట ప్రాజెక్టు కోశాధికారి జి.వెంకటలక్ష్మితోపాటు నియోజకవర్గంలోని అనపర్తి, రంగంపేట, బిక్కవోలు మండలాల అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ సేవకులు పారిశుధ్య కార్మికులు

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ.. ధవళేశ్వరంలో స్వచ్ఛ భోగి


కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 14: నిజమైన సమాజ సేవకులు పారిశుధ్య కార్మికులేనని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని ధవళేశ్వరంలో జక్కంపూడి కల్యాణ మండపంలో నిర్వహించిన స్వచ్ఛ భోగి కార్యక్రమంలో స్థానిక నాయకులు, పారిశుధ్య కార్మికులు, మహిళలతో కలిసి ఆయన భోగి మంట వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో కడియం, రాజమహేంద్రవరం రూరల్, కార్పొరేషన్ డివిజన్‌లో పారిశుధ్య కార్మికులను ఘనం గా సత్కరించారు. కార్మికులే ప్రథమ వైద్యులని మంత్రి అన్నారు. జిల్లా పం చాయతీ అధికారి జాన సత్యనారాయణ, ఎంపీడీవో కె.రత్నకుమారి వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, కడియం, రూరల్ మండలాల గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లకు సత్కారం

రాజానగరం, జనవరి 14: మండలంలో తూర్పుగోనగూడెం, నరేంద్ర పురం గ్రామాల్లోని వలంటీర్ల సేవలను ప్రశంసిస్తూ ఆదివారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఘనంగా సత్కరించారు. తూర్పుగోనగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వలంటీర్లు మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో చల్లా వెంకట్, అబ్బిరెడ్డి వెంకటేశ్వరరావు, గంగరాజు, పెద్దిరెడ్డి శ్రీను, తోట బాబూరావు, పెంకే పద్దరాజు, గొడ్డు రామ్మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా గోదారంగనాథుల కల్యాణం

రాజానగరం, జనవరి 14: రాజానగరంలోని శ్రీవల్లీ దేవసేన సమేత సంతాన సుబ్రహ్మణ్యేశ్వ రస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోదారంగనాథుల కల్యాణోత్సవం ఆది వారం వైభవంగా జరిపించారు. ధనుర్మాసోత్సవంలో భాగంగా నెల రోజులుగా ఆలయ ప్రాంగణంలో మహిళలు విష్ణు సహస్ర నామ పారాయం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భవిరిశెట్టి సిం హాచలం, ప్రమీల దంపతులు స్వామివారి కల్యాణం జరిపించారు. అలాగే రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామికి గ్రామంలో పల్లకీ ఉత్సవం చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు సముద్రాల రాంబాబు, కొత్త బాపి రాజు, దుర్గపు వసంతకుమార్, కంకటాల మహేష్, కొల్లూరి రామలింగేశ్వరరావు, పాలూరి ఏడుకొండలు పాల్గొన్నారు.దివాన్‌చెరువు: పాలచర్లలో శ్రీసాయి దుర్గా అభయాంజ నేయ స్వామి ఆలయం వద్ద గోదారంగనాథుల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు వాయిద్యాలు, కోలాటం నడుమ పల్లకీ ఉత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా ఆలయం వద్ద నెల రోజులుగా స్వామివారికి సుప్రభాతసేవ, తిరుప్పావై, నైవేద్య నివేదన అనంతరం నగర సంకీర్తన కార్యక్రమాలు జరిపారు.

జోరుగా కోడిపందాలు

- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు
- పోలీసుల ప్రేక్షకపాత్ర

అనపర్తి/కోరుకొండ, జనవరి 14: కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవంటూ పోలీసులు ఎన్ని ప్రకటనలు చేసినా కోడి ముందు చివరికి తలవంచాల్సి వచ్చింది. ఆదివారం భోగి పండుగ ప్రారంభంతోనే పందెంరాయుళ్లు ఎగబడ్డారు. కోరుకొండతోపాటు అనపర్తి మండలంలోని దుప్పలపూడి, పొలమూరు, పీరా రామచంద్రపురం గ్రామాల్లో కోడిపందాలు, గుండాట, పేకాట, నిర్వహించారు. పోలీసులు వెళ్లి పందెంరాయుళ్లను చెదరగొట్టి కొందరిపై కేసులు నమోదు చేసినప్పటికీ చివరకు పందాలు కొనసాగాయి. అధికార పార్టీ అండదండలతో బరులు ఏర్పాటు చేసిన కొందరు నేతలు పందాల నిర్వహించారు. ఆదివారం కొద్దిగా మందకొడిగా సాగిన పందాలు సోమవారం మరింతగా జరిగే అవకాశాలున్నాయి. ఆదివారం పోలీసులు నిర్వహించిన దాడుల్లో మొత్తం ఆరుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసి నాలుగు పందెం కోళ్లను, నాలుగు కోడికత్తులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రామారావు తెలిపారు.

అనపర్తిలో వీరుళ్లమ్మ జాతర ఉత్సవాలు


విద్యుద్దీపాలతో సెట్టింగ్, వీరుళ్లమ్మ

అనపర్తి, జనవరి 14: అనపర్తి గ్రామ దేవత వీరుళ్ళమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మెయిన్ రోడ్డులో భారీ సెట్టింగులతో ఏర్పాటు చేశారు. 15న అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు, చిన్నారులకు స్టార్ మహిళ, చిన్నారుల క్యాట్‌వాక్, వంటల పోటీ, ఆధ్యాత్మిక గీతాలాపన, క్లాసికల్ డాన్స్ పోటీలు నిర్వహించారు. స్టార్ మహిళ విభాగంలో పద్మ అనపర్తి స్టార్ మహిళగా ఎంపికై బహుమతి అందుకున్నారు. కార్యక్రమాలను ఉపాధ్యాయులు వైటీఎస్ ఆచార్యులు, నాగమణి, తెలుగు భాషాభిమానుల సంఘం ప్రతినిధి అంగర వంశీకృష్ణ నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు బహుమతులు అందజేశారు. కాగా జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు సత్తి వెంకటరామారెడ్డి, పడాల కళ్యాణ్‌రెడ్డి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ శివగణేష్ తెలిపారు.





రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యిలో ఏర్పాటు చేసిన బరి

కాసైయ్!

కత్తులు దూసిన కోళ్లు

సేమ్ సీన్ రిపీట్.. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది జరిగింది.. గత 20 రోజులుగా ఊరూవాడా పోలీసులదీ ఒకటే హడావుడి.. కోడి పందేలు జరగనివ్వబోమంటే జరగనివ్వబోమంటూ ప్రగల్భాలు.. పోలీసులు ఏమన్నా ఈ ఏడాది పందేల నిర్వాహకులు అంతగా టెన్షన్ పడలేదు.. సమయం చూశారు..ఆదివారం మధ్యాహ్నం సై అంటే సై అంటూ బరిలో దిగారు.. యథేచ్ఛగా కోడిపందేలు పందేలు నిర్వహిస్తున్నారు.. అప్పటి వరకూ హడావుడి చేసిన అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు.. బరికి ఇంత అని వసూలు చేసి చేతులు కట్టుకుని చూస్తున్నారు..

- ఊరూవాడా బరి తెగింపు
- జోరుగా కోడి పందేలు..గుండాట
- 12 గంటల నుంచి యథేచ్ఛగా..
- ప్రేక్షకపాత్రలో పోలీసులు
- బరుల వారీగా వసూళ్లు
- జిల్లాలో వందలాది బరులు
- పిడింగొయ్యిలో టికెట్ రూ.వెయ్యి
- గోపాలపురంలో గొడవ
- చేతులు మారిన రూ.కోట్లు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పందెం కోళ్ల కత్తులు దూశాయి. హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. పోలీసుల హెచ్చరికలు పెడచెవిన పెడుతూ పందెంరాయుళ్ళు సై అంటే సై అంటూ యథేచ్ఛగా పందేలు నిర్వహించారు. భోగి పండుగ రోజైన ఆదివారం మధ్యాహ్నం 12-30 గంటల వరకు పందేలకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదు.అనంతరం పోలీస్, రెవెన్యూ అధికారులు పరోక్ష అనుమతుల్ని మం జూరు చేస్తూ ప్రేక్షక పాత్ర పోషించారు. పందెం ఆడనిచ్చేలేదని ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది పోలీసులు ప్రగల్భాలు పలికిన సంగతి తెలిసిందే. కానీ రాజకీయ నేతలు ఊరుకుంటారా? ఏకంగా గ్రామగ్రామాన పందెం కట్టించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వందలాది గ్రామాల్లో వేలాది కోళ్ల రక్తంచిందించాయి.కోడిపందాలే కాదు. వాటికి తోడు గుండాటలు, పేకాట శిబిరాలు కూడా వెలిశాయి. బరులు వద్ద జూదగాళ్లకు మందు, విందుకు సంబంధించి షాపులు ఏర్పాటు చేసుకోవడానికి కోడి పందేల నిర్వాహకులు వేలంపాట నిర్వహించినట్టు సమాచారం. మందు అమ్మకాలు జోరందుకున్నాయి. కోడి పందేల్లో రూ.కోట్లు చేతులు మారాయి. కోడిపందెం ఒకటి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ సాగింది. దీనికి పై పందాలు అదనం. గుండాటలో కనీసం రూ.50తో మొదలు పెట్టాలి. ఎంతైనా కాయవచ్చు. ఒక్కో ఆటలో రూ.రూ.5 వేల నుంచి 10 వేలకు పైగా పందెం ఉంటుంది. రెండు మూడు నిమిషాల్లో గుళ్ల తిప్పేస్తారు. వేలాది మంది జేబులు ఖాళీ అయ్యాయి. ఈసారి కోడి పందేల నిర్వహణ తీరు కూడా మారింది. గతంలో పందెంను ఎవరైనా ఉచితంగా చూడవచ్చు. ఇవాళ ఉచితంగా చూసే పందేలు ఉన్నాయి. ప్రత్యేక టికెట్‌తో కూడా ఈ సారి పందేలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యిలో ప్రత్యేక బరి ఏర్పాటు చేశారు. పెద్ద టెంట్ వేసి దాని చుట్టూ ఇనుప పెన్సింగ్ ఏర్పాటు చేశారు. పందెం బరి ఏర్పాటు చేసి దాని చుట్టూ కుర్చీలు వేశారు. ఒక వైపు ఎత్తుగా స్టేడియం వేదికలా కట్టి, అక్కడ స్పెషల్ కుర్చీలు వేసి, వీఐపీలకు రిజర్వు చేశారు. ఈ బరిలోకి ఎంటర్ కావాలంటే రూ.1000 టికెట్ తీసుకోవాలి. వీరి కోసం చికెన్ పకోడి వంటివి సెపరేట్‌గా ఏర్పాటు చేశారు. కవలగొయ్యిలో కూడా ఇలానే ఏర్పాటు చేశారు. కానీ కాస్త చిన్నది. ఇక్కడ టికెట్ రూ.500. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి టికెట్లు అమ్మకం మొదలుపెట్టారు. మూడు గంటల దాటాక ఇవన్నీ కిక్కిరిసిపోయాయి. ఒక్కో బరిలో రూ.లక్షల జూద వ్యాపారం జరిగింది. జిల్లాలో మొత్తం రూ.కోట్లలో జూద వ్యాపారం సాగింది. పిడింగొయ్యి బరిలోనే సుమారు 9 టెంట్‌ల వరకూ వేశారు. కొన్ని చోట్ల దూరంగా రాజకీయనేతల ఫెక్సీలు ఏర్పాటు చేశారు. ఎక్కువ చోట్ల వైసీపీ నేతలు బరులు ఏర్పాటు చేయగా, టీడీపీ నేతలు కూడా కొన్నిచోట్ల ఏర్పాటు చేశారు.ఇలా జిల్లాలోని రాజమహేంద్రవరం డివిజన్‌లోనూ, కొవ్వూరు డివిజన్ లోని అన్ని మండలాల్లోనూ పందాలు జోరుగా జరిగాయి. సంక్రాంతికి నాలుగు రోజుల ముందు నుంచీ హడావుడి చేసిన యంత్రాంగం చతికిలపడింది. గోపాలపురంలో పందెంగాళ్ల గొడవ జాతీయ రహదారిపైకి చేరింది. వాహనాలు భారీగా నిలిచిపోయాయి. దేవరపల్లి పీఎస్ పరిధిలోనూ పందేల జోరు కొనసాగింది. నిడదవోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని డి.ముప్పవరం వెళ్లే దారిలో పక్కపక్కనే మూడు బరులు ఏర్పాటు చేశారు. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో పుణ్యక్షేత్రంలో భారీ బరి సిద్ధం చేశారు. కోలమూరు, కొంతమూరులో కూడా సోమవారం నుంచి పందెం పుంజులు చెలరేగిపోనున్నాయి. ఈ ఏడాది ఎన్నికలు ఉండడంతో అధికార పార్టీ నాయకులు జూదాన్ని గెలుపు అవకాశంగా తీసుకున్నారని తెలుస్తోంది. కోరుకొండ సమీపంలోని బరిని రూ.13లక్షలకు పాడుకొన్ని హైదరాబాద్ వాసులు ఇప్పటికే వ్యాపారం మొదలుపెట్టారు. భోగి పండగ రోజైన ఆదివారం ఉదయం నుంచే పందెం బరులు సిద్ధం చేశారు. రాత్రి వేళల్లో కూడా పందాలు నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంతేకాక కోడిపందాలను చిత్రీకరించ డానికి అనేక చోట్ల ప్రత్యేక కెమేరాలు కూడా ఏర్పాటు చేయడం గమనార్హం.



నల్లజర్లలో పందెం వేస్తున్న నిర్వాహకులు



రాజమహేంద్రవరంలో బరి వద్ద సిద్ధంగా ఉన్న పుంజులు



రాజమహేంద్రవరంలో డింకీ పందెం వేస్తున్న వాసు



గోపాలపురంలో గొడవ

గోపాలపురం, జనవరి 14 : గోపాలపురంలో నిర్వహిస్తున్న కోడిపందెల్లో ఆదివారం ఇద్దరు యువకుల మధ్య చెలరేగిన వివాదం ముదిరి తీవ్ర ఘర్షణకు దారి తీసింది. ఇద్దరు యువకులు కోడిపందేలపై కాచుకున రూ.200తో మొదలైన వివాదం యువకులు సంమయమనం కోల్పోయి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.ఆ వివాదం పెరిగి పెద్దదై జాతీయ రహదారి పైకి చేరింది. భారీగా జనం గుమిగూడడంతో జాతీయ రహదారి పై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనాలు బారులుతీరాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఎస్ఐ కే.సతీష్‌కుమార్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గుమిగూడిన జనాన్ని చెదరగొట్టారు.వాహనాలకు అంతరాయం లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వివాదానికి కారణమైన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీసులకు మామూళ్లే..మామూళ్లు..



జిల్లాలో పోలీసులకు ఈ సంక్రాంతి పండుగ భలే పండుగ. పందెం నిర్వాహకులు పెద్ద పందేలకు రూ.లక్ష వంతున, చిన్న పందేలకు రూ.50 వేలు వంతున పోలీసులకు ముడుపులు చెల్లించినట్లు ప్రచారం జరుగుతోంది. పందాలు ఆడనిచ్చేలేదని పోలీ సులు తెగ ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. రాజకీయనేతల ఒత్తిళ్ల వల్ల చివరకు లొంగిపోయారు.దీంతో డబ్బులు బాగా ముట్టాయి.

ఆనందం నిండుగా భోగి పండుగ



ఆదివారం తెల్లవారుజాము నుంచే సంక్రాంతి వచ్చేసింది..ఊరూవాడా సందడి తెచ్చేసింది.. వేకువజామునే భోగిమంట వేసేందుకు యువత సన్నద్ధమైపోయారు. ఎక్కడెక్కడి నుంచో తెచ్చిన పుల్లలతో వీధివీధినా పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు.చిన్నారులు తమ ఎత్తు భోగిపిడకల దండలు పట్టుకుని మంటల వద్ద క్యూకట్టారు.. భోగభాగ్యాలను తేవాలని భోగి పండుగను ఆనందం నిండుగా నిర్వహించారు.. మహిళలు సంక్రాంతి లక్ష్మిని పిలుస్తూ ఇళ్ల ముందు ముగ్గులతో అలంకరించారు.

ఓ రోజు ముందుకు సంక్రాంతి

ఎవరైనా గమనించారా!.. సంక్రాంతి పండుగ ఓ రోజు ముందుకు జరిగింది. జనవరి 14న వచ్చే పండుగ 2008 నుంచీ జనవరి 15న వస్తోంది. ఎందుకంటారా?..దీనికో కారణం చెబుతున్నారు జ్యోతిష్కులు. సూర్యుడి ప్రతి ఏడాదీ మకర సంక్రమణం చేసిన రోజున సంక్రాంతి జరుపుకుంటాం. సంక్రాంతి అంటే నూతన కాంతి. ఇలా జరిగే క్రమంలో ప్రతి ఏడాదీ 20 నిమిషాలు ఆలస్యం అవుతుంది. స్థూల గణన చేస్తే మూడేళ్లకు ఒక గంట, 72 ఏళ్లకు ఒక రోజు అవుతుంది. అందువల్ల ప్రస్తుతం జనవరి 15కి జరిగింది. 1935 నుంచీ 2007 వరకూ 72 ఏళ్ల పాటు జనవరి 14న సంక్రాంతి జరుపుకున్నారు. 2008 నుంచి 2080 వరకూ 15న సంక్రాంతి వస్తుంది. 2081 నుంచి 2153 వరకూ మరో రోజు ముందుకు జరిగి 16న ఈ పండుగ జరుపుకుంటారని చెబుతున్నారు.

- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)



ఆగని పోరు : బిక్కవోలులో ఎస్మా చట్టం ప్రతులు, షోకాజ్ నోటీసులను భోగిమంటల్లో వేస్తున్న అంగన్‌వాడీలు

తగ్గేదేలే!

అంగన్‌వాడీలు భోగిమంటల్లో వేసిన ఎస్మా చట్టం ప్రతులు, షోకాజ్ నోటీసులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 14 : మీరేం చేసినా దిగొచ్చేదే లేదు.. ఎండాకైనా వెళతాం అంటూ అంగన్‌వాడీలు భీష్మించారు.. ప్రభుత్వం హెచ్చరికలు చేసినా ఆందోళనలు కొనసాగు తూనే ఉన్నాయి. అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6వ తేదీన ప్రయోగించిన ఎస్మా చట్టం ప్రతులు, అంగన్వాడీలను విధుల నుంచి తొలగిస్తామంటూ ఇచ్చిన షోకాజ్ నోటీసులను అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆదివారం రాజమహేంద్రవరం జాంపేటలో భోగి మంటల్లో దహనం చేశారు. అనంతరం గాంధీ విగ్రహం వరకూ ర్యాలీగా వెళ్లి తమ నిరసన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల పట్ల వ్యవహరిస్తున్న తీరుకు నిరసన తెలిపారు.సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.శారద, జె.సునీత, యూనియన్ నాయకులు స్రవంతి, పద్మ, దేవి, తాయారు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కందుల దుర్గేష్ సతీమణి అంత్యక్రియలు పూర్తి



భార్య ఉషారాణి మృతదేహం వద్ద కందుల దుర్గేష్, పరామర్శిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 14 : జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ సతీమణి అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. అనారోగ్యం కారణంగా ఆమె శనివారం మృతి చెందిన విషయం విదితమే. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని నివాసం నుంచి ఆమె పార్థివదేహాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు ఇన్నీసుపేట కైలాస భూమికి తరలించారు. అక్కడ అం త్యక్రియలను దుర్గేష్ తనయుడు డాక్టర్ తేజ పూర్తి చేశారు. తొలుత ఉషారాణి పార్థివదేహాన్ని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమా ర్, అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సీసీసీ ఎండీ పంతం కొండలరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు, జనసేన కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ.రామారావు, జనసేన నగర అధ్యక్షుడు వైశ్రీను, మాజీ డిప్యూటీ మేయర్ బాక్స్ ప్రసాద్, కనకాల రాజా, చేరుకూరి వెంకట రామారావు సందర్శించి నివాళుర్పించారు. కందుల దుర్గేష్‌ను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ముగిసిన ధనుర్మాసం ఉత్సవాలు

ఘనంగా గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం

కోరుకొండ, జనవరి 14 : ధనుర్మాస మహోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ధనర్మాసం ఆరంభం నుంచి గత 30 రోజులుగా వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తిరుప్పావై పారాయణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.ధనుర్మాసోత్సవాలు ఆదివారం ముగియడంతో గోదారంగనాథుల కల్యాణోత్సవాలు నిర్వహించారు.ధవళేశ్వరం జనార్దనస్వామి ఆలయం, కోరుకొండ లక్ష్మినరసింహస్వామి ఆలయం, భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం, ఆర్యవైశ్య కోదండ రామాలయం,పశ్చిమగోనగూడెం గీతామిషన్‌లో కల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై కల్యాణోత్సవాలను తిలకించారు. స్వామి అమ్మవార్లకు పలువురు భక్తులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా భక్తులకు కల్యాణ అక్షింతలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైష్ణవ ఆలయాలు ఉదయం నుంచి భక్తజనంతో కిటకిటలాడాయి. ఆలయ అర్చకులు కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహించారు.



కోరుకొండలో గోదారంగనాథుల కల్యాణోత్సవం



పల్లెకు.. పండగొచ్చింది!

- సంక్రాంతికి 'పల్లె పులకింత'
- పట్టణాలు ఖాళీ.. గ్రామాలు కళ కళ
- పల్లెల వైపు దౌడ్ తీసిన నగరవాసులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పల్లె వాకిళ్ల పులకరించే రోజు.. నగరవాసులు పుట్టిపెరిగిన మట్టి వాసన గుండెనిండా నింపుకొనే రోజు, సహవాసగాళ్లతో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని మనసు తేలిక చేసుకునే రోజు, ఆడాళ్ల కష్టసుఖాలు పంచుకొనే రోజు.. పిన్నీ, మామ, తాత అంటూ పిల్లలు ఇల్లంతా గోల చేసే రోజు.. బావను ఆట పట్టించే మరదళ్లు.. తొడగొట్టే పందెం పుంజు.. మతిపోగొట్టే పడతుల అందాలు.. కొత్త అల్లుళ్లు.. అత్తవారి వంటకాలు.. మామగారి మర్యాదలు.. అమ్మమ్మ ఆశీస్సులు.. తాతయ్య మొట్టికాయలు.. ఒకటేమిటి పట్టణాల పరుగుల జీవనంలో కోల్పోయే మమకారం, ఆప్యాయత, అనురాగం, ఓదార్పు, మనశ్శాంతిని మూడు రోజుల్లో మళ్లీ రీచార్జ్ చేసే రోజు సంక్రాంతి. ఈ ఏడాదీ ఆ ఉత్సాహం పల్లెలకు ఉరుకుల పరుగున వచ్చేసింది. పల్లె ఒడిలో కల్మషం లేకుండా దొరికే కలగలుపు కూర కోసం అను బంధాలు రెక్కలు కట్టుకుని వాలిపోయాయి. భోగి రోజున అర్ధరాత్రి నుంచే భోగి మంటలను వెలిగించారు. చిన్నారుల తలపై భోగి పళ్లు పోసి మురిసిపోయారు. భోగి రోజున బంధువులు కొందరు చేరుకో వడం ఆలస్యమైనా సంక్రాంతికి బాంధవ్యం చెంత చేరిపోయారు. డూడూ బసవన్నలు, హరిదాసులు, గొబ్బెమ్మలు, అరిసెలు, పొంగడాలు, జంతికలు, కజ్జికాయలు ఆశ్చర్యంగా చూస్తూ ఈ తరం పిల్లలు వాటి తెలుగు పేర్లను సెల్‌ఫోన్‌లో ఇంగ్లీషులో తర్జుమా చేసుకొని తెలుసుకోవడంలో బిజీ అయిపోయారు. బావాబామ్మర్దులు, అన్నాదమ్ములు.. ఇలా పందెం పుంజులను యుద్ధాలకు తీసుకెళ్లడానికి సిద్ధమైపోయారు. పల్లె వాకిళ్ల గంగిరెద్దులు తొక్కడం కోసం గొబ్బెమ్మలను సిద్ధం చేసుకున్నాయి. ఇంకేముంది పట్టణాలు బోసిపోగా.. పల్లెల్లో సంక్రాంతి సందడి ఉట్టిపడుతోంది. పండుగ శోభ పరవశింపజేస్తోంది.

సంబురాల కోసం పరుగున

అన్ని పండుగల్లో సంక్రాంతి పండుగ భిన్నమైనది. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ ఈ నాలుగు రోజులూ సరదా సంతోషాలకే ప్రాధాన్యం ఉంటుంది. ఏడాదంగా ఉరు కులతో గడిపే పట్టణవాసానికి ఏడాదికి మూడు రోజులు సెలవిచ్చి ఈ ఉల్లాసం కోసం ఉత్సాహంగా సొంతూళ్లకు.. పల్లెల్లోని బంధువుల ఇళ్లకు పరుగున వచ్చేస్తారు. అందుకే రైళ్లలో రిజర్వేషన్లు ఫుల్, బస్సుల్లో జాగా లేదు, విమానంలో సీట్లు లేవు, హైవేపై కార్ల క్యూ.. అయినను.. ఎలాగైనా వెళ్లి రావలె.. అదే సంక్రాంతి గొప్పతనం. సంక్రాంతి వచ్చిందంటే ముఖ్యంగా గోదావరి జిల్లాల్లో సందడి మాటల్లో చెప్పేది కాదు. కన్నుల పండువను కళ్ల ముందుకు తెస్తుంది. అందువల్ల జీవనోపాధికి ఎంత దూరంలో ఉన్నా సంక్రాంతికి సొంతూరుకు చేరుకోవాల్సిందే. మూడు రోజులూ బంధు వులతో ఎంజాయ్ చేయాల్సిందే. దీంతో కాస్త కష్టం అనుభవించినా పల్లెకు చేరుకున్నాక ప్రయాణ బడలికను పండుగ సరదాల్లో కలిపేస్తున్నారు. పండుగకు రెండు మూడు నెలల నుంచే రైళ్లకు రిజర్వేషన్ చేయించుకున్నా కిక్కిరిసిన ప్రయాణికుల్లో ఇబ్బందులు పడుతూనే పల్లె బాట పట్టారు. పండుగకు ఎక్కువగా హైదరాబాద్ నుంచి గోదావరి జిల్లాలకు వస్తుంటారు. ప్రత్యేక రైళ్ల వేసినా.. ఆర్టీసీ సుమారు 60 ప్రత్యేక బస్సులను నడిపినా.. ప్రైవేటు ట్రావెల్స్ టికెట్ ధరలు బాదేసినా.. తిప్పలు పడుతూనే సొంతూళ్లకు వచ్చేశారు. అటు విమానాల్లో కూడా టికెట్లు దొరకని పరిస్థితి ఉన్నా 'తగ్గేదేలె' అంటూ రెక్కలు కట్టుకొని వాలిపోయారు. దీంతో పల్లె తనవాళ్లను చూసి మురిసిపోతోంది. ఒకరకంగా తెలుగువారింట ఈ పెద్ద పండుగ బంధాలకు కావలి కాస్తుందంటే అతిశయోక్తి కాదు.

సంక్రాంతి నూతన కాంతే కదా!

సంప్రదాయాలు, ఆచారాల్లో భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఇమిడి ఉంటాయని పెద్దల ఉవాచ. సం క్రాంతి అంటే నూతన కాంతి అని అర్థం. పంటలు చేతికొచ్చి గాదెలు ధాన్యంతో కళకళలాడే వేళ. సంక్రాంతిలో నిగూఢంగా ఉన్న మర్మాలు ఉన్నాయి. ఛాందసత్వాన్ని పక్కపెట్టి శాస్త్రీయంగా అర్థం చేసుకుంటే ఆ అంతరార్థాలు ఏమిటో అనుభవపూర్వకంగా తెలుసుకోవచ్చని ఆ తరం వారు హిత బోధ చేస్తున్నారు. ఉరుకుల పరుగుల ఆధునిక జీవనంలో.. ఫోనులో ముఖాలను చూసుకుంటూ పలకరింపుల జీవి తంలో అసలే బంధాలు పలుచబడిపోయాయనేది ఏవరూ కాదనలేని వాస్తవం.సంక్రాంతి లేకుంటే అసలే అంతంత మాత్రంగా ఉన్న బంధాలు కాలగర్భంలో కలిసిపోయేవేనని పెద్దలు పడే బాధకు పెద్ద పండుగ కాస్త సాంత్వన చేకూరుస్తోంది.. ఏడాదంతా అమ్మ గారింటికి రాకపోయినా సంక్రాంతికి కచ్చితంగా ఆడపిల్లలు పుట్టింటికి వస్తారు. భర్త, ఆయన తరపు వారు కూడా ఈ పండుగ రోజున వాళ్లకు అడ్డుచెప్పరు. అందుకే అత్తవారిల్లు అల్లుడు, కూతురు, పిల్లలతో మూడు రోజులూ కళకళ లాడుతుంది.ఇలా భోగి పండ్లు(రేగు), గొబ్బెమ్మలు, హరిదా సులు, గంగిరెద్దులు, గాలిపటాలు.. ఇలా సంప్రదాయంలో దాగి ఉన్న ఆరోగ్య జీవన విధానానికి అవసరమైన ఎన్నిటినో సంక్రాంతి పండుగ మనకు దూరం కాకుండా చేస్తోంది. ముఖ్యంగా పిల్లలు.. భావితరాలు.. బంధాలకు దూరం కాకుండా పహారా కాస్తోంది.



నిండుగా రాజమహేంద్రవరం బస్టాండ్

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com



జగన్‌కు జీవిత ఖైదు తప్పదు
టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిపాటి

దేవరపల్లి, జనవరి 14: వైసీపీ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో మునిగిపోయిందని, సీఎం జగన్ చేసిన అరాచకాలకు, దోపిడీకి జీవితఖైదు తప్పదని రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి మద్దిపాటి వెంకట్రాజు విమర్శించారు. ఆదివారం ఆయన గౌరీపట్నంలో విలేకర్లతో మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి చిత్తూరు దాక జగన్ అవినీతిని, తీరును వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బహిరంగంగా ఎండగట్టారని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల దృష్టి మళ్లించేందుకు జగన్ జేబు సంస్థ అయిన సీఐడీని అడ్డుపెట్టుకుని చంద్రబాబుపై కక్షసాధింపునకు పాల్పడుతున్నారని విమర్శించారు. జగన్‌పై 38కేసులు నమోదయ్యాయని, రూ.43 వేల కోట్లు దోపిడీపై సీబీఐ, ఈడీ చార్జ్ షీట్లు కూడా వేసిందని సదరు కేసులపై 3500 వాయిదాలు తీసుకున్నాడని విమర్శించారు. ఆ కేసులకు హాజరైతే శిక్షపడుతుందనే భయంతో కోర్టుకు వెళ్లకుండా వాయిదాలు తీసుకుంటున్నారని విమర్శించారు. ప్రజాపాలన గాలికి వదిలేసి దోపిడీలకు పాల్పడుతున్న వైసీపీ నాయకులకు, సీఎం జగన్‌కు శిక్షతప్పదన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన అత్యధిక మెజారిటీతో గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

క్రికెట్ పోటీల విజేత నిడదవోలు వెంకీ ఎలెవెన్స్



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి

ఉండ్రాజవరం, జనవరి 14: వేలివెన్ను గ్రామంలో పదిరోజులుగా నిర్వహిస్తున్న శశిధర్ మెమోరియల్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా నియోజకవర్గస్థాయిలో క్రికెట్, వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిసాయి. క్రికెట్ ఫైనల్ పోటీలో ఉండ్రాజవరం పోసిటీమ్‌తో జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో నిడదవోలు వెంకీ ఎలెవెన్స్ జట్టు విజయం సాధించింది. వాలీబాల్ ఫైనల్ పోటీలో తిమ్మరాజుపాలెం జోసెఫ్ టీమ్‌తో జరిగిన మ్యాచ్‌లో మునిపల్లి బన్ను టీమ్ విజయం సాధించింది. విజేతలకు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు బహుమతులను అందజేశారు. క్రీడలను, క్రీడాకారులను ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకుడు, ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోపవరంలో క్రీడా పోటీలు

నిడదవోలు, జనవరి 14: మండలంలోని గోపవరంలో టీడీపీ నాయకుడు ఆరేపల్లి చిన్న నంగాలు, సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పంచదార వెంకట దుర్గాప్రసాద్, ఆరేపల్లి దుర్గా శ్రీను, ముప్పిడి సాయిప్రసాద్, టోర్నమెంటు నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కందుల ఉషారాణికి రామారావు నివాళి

కొవ్వూరు, జనవరి 14: జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ సతీమణి ఉషారాణి మృతి బాధాకరమని ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు అన్నారు. ఆదివారం దుర్గేష్ నివాసంలో ఉషారాణి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దుర్గేష్‌ను పరామర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

పేదలకు చీరల పంపిణీ

దేవరపల్లి, జనవరి 14: దేవరపల్లిలో పెడసనిగంటి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు, పేదలకు చీరలు, పంచులు, పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పురోహితుడు పెడసనిగంటి సాయిబాబు, శశికాంత్‌శర్మ ఇంటి వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా విచ్చేసి చీరలు, పంచులు అందజేశారు. అనంతరం రూ.6లక్షల నిధులతో ఏర్పాటు చేసిన సీసీరోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, పరమేష్ బయోటెక్ ఫ్యాక్టరీ ఎండీ ఆనంద్‌స్వరూప్, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, స్థానికులు తీగల బలరామయ్య, దుగ్గిన గంగాధర్, కామిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

బూటకపు హామీల ప్రతులు దహనం



అసంబద్ధ విధాన పత్రాలను భోగి మంటల్లో వేసి దహనం చేసిన యూటీఎఫ్ నాయకులు

చాగల్లు, జనవరి 14: ఉద్యోగ వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని ఉద్యోగ సంఘాల నాయకులు కోరారు. స్థానిక అశోక్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాల సమీపంలో యూ టీ ఎ ఫ ఆధ్వర్యంలో బూటకపు హామీలు, అసంబద్ధ విధాన పత్రాలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ అక్రమ కేసులను ఖండించారు. అంగన్‌వాడీ హెల్పర్స్, వర్కర్లు సంఘం నాయకులు భోగి మంటల్లో జీవో నెం.2 ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు.

భాస్కరగౌతంకు రామ మందిర ప్రారంభోత్సవ ఆహ్వానం

కొవ్వూరు, జనవరి 14: కొవ్వూరుకు చెందిన సుప్రీంకోర్టు న్యాయవాది తాడిమళ్ళ భాస్కరగౌతంకి ఈ నెల 22న జరిగే అయోధ్య శ్రీరామ మందిర ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందింది. సుప్రీంకోర్టులో రామ జన్మభూమి కేసులో విజయం సాధించడానికి ప్రముఖ పాత్ర వహించిన న్యాయవాదుల బృందంలో భాస్కరగౌతం ఒకరు. దీంతో శ్రీరామ మందిర ప్రారంభోత్సవానికి శ్రీరామ క్షేత్ర తీర్థ ట్రస్టు ప్రత్యేక ఆహ్వానం పంపించింది. ఈ ఆహ్వాన పత్రికను కొవ్వూరు పురుషోత్తమ రామ మందిరంలో జరుగుతున్న శ్రీరామ యాగం పూజలో ఉంచి ఆదివారం ఆంధ్ర రాష్ట్ర ఆగమ సలహాదారు దోర్బల ప్రభాకరశర్మ భాస్కరగౌతంకు అందజేశారు.

వీరుళ్లమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభం



విద్యుద్దీపాలతో సెట్టింగ్, వీరుళ్లమ్మ



అనపర్తి, జనవరి 14: అనపర్తి గ్రామ దేవత వీరుళ్ళమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మెయిన్ రోడ్డులో భారీ సెట్టింగులతో ఏర్పాటు చేశారు. 15న అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు, చిన్నారులకు స్టార్ మహిళ, చిన్నారుల క్యాట్‌వాక్, వంటల పోటీ, ఆధ్యాత్మిక గీతాలాపన, క్లాసికల్ డాన్స్ పోటీలు నిర్వహించారు. స్టార్ మహిళ విభాగంలో పద్మ అనపర్తి స్టార్ మహిళగా ఎంపికై బహుమతి అందుకున్నారు. కార్యక్రమాలను ఉపాధ్యాయులు వైబీఎస్ ఆచార్యులు, నాగమణి, తెలుగు భాషాభిమానుల సంఘం ప్రతినిధి అంగర వంశీకృష్ణ నిర్వహించారు. విజేతలకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదిలక్ష్మి దంపతులు బహుమతులు అందజేశారు. కాగా జాతర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు సత్తి వెంకటరామారెడ్డి, పడాల కళ్యాణ్‌రెడ్డి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ శివగణేష్ తెలిపారు.

కొవ్వూరులో శ్రీరామ హోమం

కొవ్వూరు, జనవరి 14: కొవ్వూరు పురుషోత్తమ రామ మందిరంలో ఆదివారం శ్రీరామ హోమం నిర్వహించారు. అయోధ్యలో శ్రీరామ మందిరంలో ఈ నెల 22న శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 13,14,15 తేదీల్లో శ్రీరామ హోమం, రామాయణ పారాయణం, ఉపన్యాసాలు చేపట్టారు. కార్యక్రమంలో కొండూరి కోటేశ్వరరావు, ఇనుగంటి ఉమా రామారావు, కలిగొట్ల కృష్ణారావు, గుడివాక శ్రీనివాసు, కరుటూరి సత్యనారాయణ పాల్గొన్నారు.



కొవ్వూరులో కోడి పందాలు నిర్వహిస్తున్న దృశ్యం



నల్లజర్లలో పందెం కోళ్లతో సిద్ధంగా ఉన్న పందెంరాయుళ్లు



తాళ్లపూడిలో టెంట్‌లో ఏర్పాటు చేసిన గుండాట బోర్డులు

జోరుగా కోడిపందాలు

- చేతులు మారిన కోట్లు
- ఆదివారం మధ్యాహ్నం తరువాతే అనుమతులు
- ఆపై చూసీచూడనట్టు వ్యవహరించిన వైనం
- బరుల వద్ద గుండాట, పేకాట, కోతాట
- అక్కడే మందు, విందు దుకాణాల ఏర్పాట్లు
- షాపుల ఏర్పాటుకు పలుచోట్ల వేలం పాటలు

కొవ్వూరు/నల్లజర్ల/నిడదవోలు/తాళ్లపూడి/దేవరపల్లి/గోపాలపురం/చాగల్లు, జనవరి 14: హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ, పోలీసుల హెచ్చరికలు పెడచెవిన పెడుతూ పందెంరాయుళ్లు యథేచ్ఛగా కోడిపందాలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు చేపడతామంటు ప్రచారాలు హోరెత్తించిన పోలీసు, రెవెన్యూ అధికారులు ఆదివారం మధ్యాహ్నం 12:30గంటల వరకు పందాలకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదు. అనంతరం పరోక్ష అనుమతుల్ని మంజూరు చేస్తూ పందాలు నిర్వహించేందుకు చూసీచూడనట్టు వదిలేశారు. దీంతో అధికార వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో పంట పొలాలను, లేఅవుట్‌లను, ఖాళీస్థలాలను ట్రాక్టర్లతో దున్ని బరులను అప్పటికప్పుడు సిద్ధం చేసి పందాలు జరిపారు. షామియానాలు వేసి కోళ్లకు కత్తులు కట్టి మరీ పందాలు నిర్వహించారు. కొవ్వూరు మండలంలోని తోగుమ్మి శివారు, ఐ.పంగిడి, సీతంపేట, పశివేదల, వేములూరు(ఔరంగాబాద్ శివారు) ఆరికిరేవుల, కొవ్వూరులోని నందమూరు రోడ్‌లో కోడి పందాలు జరిగాయి. బరులు వద్ద జూదగాళ్ల కోసం మందు, విందుకు సంబంధించి షాపులు ఏర్పాటుచేసుకోవడానికి కోడి పందాల నిర్వాహకులు వేలంపాట నిర్వహించినట్టు సమాచారం. కాగా నల్లజర్ల మండలంలో 10గ్రామాల్లోను, దేవరపల్లి మండలంలో దేవరపల్లి, త్యాజంపూడి, యర్నగూడెం, కురుకూరు, చిన్నాయిగూడెం, బంధపురం గ్రామాల్లోను, గోపాలపురం మండలంలో గోపాలపురం, వేళ్లచింతలగూడెం, వెంకటాయపాలెం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, దొండపూడి, హుకుంపేటలో రెండుచోట్ల కోడిపందాలు నిర్వహించారు. తాళ్లపూడి మండలంలో తాళ్లపూడి-2, పెద్దేవం -2, రావూరుపాడు -1, గజ్జరం -2, మలకపల్లి -1 చొప్పన పందాలు నిర్వహించారు. మొదటి రోజు కోటి రూపాయల వరకు పందాల్లో చేతులు మారాయి. అలాగే బరుల వద్ద గుండాట, పేకాట, కోశాట జోరుగా నిర్వహించారు. యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మద్యం ఏరులై ప్రవహించింది. సంక్రాంతి సందర్భంగా 90 మందిపై బైండోవర్ కేసులు పెట్టినట్టు తాళ్లపూడి ఎస్ఐ కేవీ రమణ తెలిపారు. ఇదిలా ఉండగా చాగల్లు మండలంలోని ఒక బరిలో కోడి పందాల నిర్వహణ ఫొటోలు తీస్తున్న విలేకరులపై నిర్వాహకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫొటోలు తీస్తున్నారు.. కోడి పందాలు ఆపేస్తారా, అంత దమ్ముందా మీకు ఉందా? లక్షలు రూపాయలు ఇచ్చి అనుమతులు తెచ్చుకున్నాం. ఎవరి వాటా వారికి వెళుతుంది. మీరేంటి ఇక్కడ?' అంటూ ప్రశ్నించారు. చాగల్లు ఇందిరమ్మ కాలనీ, నందిగంపాడు వెళ్లే రోడ్డు, ఊనగట్ల, చిక్కాల, బ్రాహ్మణగూడెం, మల్లవరం గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసి కోడి పందాలు భారీ ఎత్తున నిర్వహించారు. ప్రజాప్రతినిధులే దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



దేవరపల్లిలో కోడిపందాలు నిర్వహిస్తున్న దృశ్యం



గోపాలపురంలో బరిలో పోట్లాడుకుంటున్న కోడిపుంజులు



చాగల్లులో గుండాట ఆడుతున్న దృశ్యం

ఘనంగా భోగి

కొవ్వూరు/నిడదవోలు/చాగల్లు/ఉండ్రాజవరం, జనవరి 14: మకర సంక్రాంతి సందర్భంగా భోగి పండుగను ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజాము నుంచే చిన్నారులు, మహిళలు తలస్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి భోగి మంటల వద్దకు చేరుకుని భోగి పిడకల దండలు మంటలలో వేశారు. చిన్నారులపై భోగి పండ్లు వేసి ఆశీర్వదించారు. ఆలయాలకు చేరుకుని పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వృత్తిరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా పండుగ సందర్భంగా స్వస్థలాలకు వచ్చారు. ఈ సందర్భంగా కొవ్వూరులో టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ జొన్నలగడ్డ రాధారాణి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రజా వ్యతిరేక జీవోల ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు.

దేవరపల్లి: సంక్రాంతి సందర్భంగా మండలంలోని యాదవోలులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అనిశెట్టి గంగరాజు, శ్రీనివాస్, ముమ్మిడి బాలకృష్ణ, అనిశెట్టి బాబు పాల్గొన్నారు.



నిడదవోలు గాంధీబొమ్మ సెంటరులో భోగి మంట వేసిన దృశ్యం



దేవరపల్లి: యాదవోలులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సువర్ణరాజు



కొవ్వూరులో ప్రజావ్యతిరేక జీవోల ప్రతులను భోగి మంటలో వేస్తున్న దృశ్యం

కీడు తొలగాలి.. ఏపీ వెలగాలి
టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



బిక్కవోలు: ఇళ్లపల్లిలో ప్రజావ్యతిరేక జీవో ప్రతులను భోగిమంటల్లో వేస్తున్న దృశ్యం

బిక్కవోలు, జనవరి 14: రాష్ట్రానికి పట్టిన కీడు తొలగి ఏపీ వెలగాలంటే మరలా టీడీపీని అధికారంలోకి తీసుకురావాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. భోగి పండుగ సందర్భంగా ఆయన ఆదివారం రంగాపురం, ఇళ్లపల్లి గ్రామాల్లో భోగిమంటలో వైసీపీ ప్రజా వ్యతిరేక జీవోలను, వైసీపీ నాయకుల చిత్రపటాలను వేసి దహనం చేశారు. రాష్ట్రంలో ప్రజ లు సుభిక్షంగా ఉండాలంటే వైసీపీ పాలన పోవాలన్నారు. ఆపై గ్రామంలో టీడీపీ నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలను పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సగర, ఉప్పార సాధికార సమితి సభ్యులు కానేటి అప్పలస్వామి, కనుమూరి సాయిరాజు, చిరంజీవిరాజు, జోష్‌బాబు, మణిరాజు, యే సురత్నం పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలూ ఐదేళ్లకోసారే పెంచండి

- కొవ్వూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు పుష్పావతి
- 34వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె
- జీవో నెం.2 ప్రతులు భోగి మంటల్లో వేసి దహనం



కొవ్వూరులో జీవో నెం.2 ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు

కొవ్వూరు, జనవరి 14: జీతాలు ఐదేళ్లకోసారి పెంచుతామని చెప్తున్న రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసరాలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్, విద్యుత్, పన్నుల ధరలు ఐదేళ్లకోసారే పెంచాలని కొవ్వూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సీహెచ్ వీఎల్ పుష్పావతి అన్నారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆదివారం 34వ రోజు అంగన్వాడీలు సమ్మెను కొనసాగించారు. అంగన్వాడీలపై ఎస్మా చట్టం విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.2 ప్రతులను భోగి మంటల్లో వేసి తగలబెట్టారు. ధరలు పెంచినప్పుడు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పెంచాలని, రూ.వెయ్యి జీతం పెంచి ఐదేళ్లు సర్దుకుపోమనడం సరికాదని పుష్పావతి పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాల న్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు సీహెచ్ భవాని, ఎస్.శాంతకుమారి, ఎ.భ్రమరాంబ, బి.వసంత, కేసీ లక్ష్మి, బి.ఉష బి.గౌతమి, వి.శ్రీదేవి పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో అంగన్వాడీలు వినూత్నంగా హరిదాసు వేషధారణలో నిరసన తెలిపారు. పండుగ దినాల్లో సైతం పస్తులతో ఉంచిన ఘనత వైసీపీకే దక్కుతుందని విమర్శించారు. అంగన్వాడీల పట్ల ప్రభుత్వానికి కనికరం లేదని ఈ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా గుణపాఠం చెబుతామని నియోజకవర్గ నాయకురాలు టీపీ లక్ష్మి, సీఐటీయూ నాయకుడు రత్నాజీ అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పద్మ కామేశ్వరి, కే.సావిత్రి, కే.వరలక్ష్మి, ఉండవల్లి మంగతాయారు పాల్గొన్నారు.

గోపాలపురం/నిడదవోలు : గోపాలపురం, నిడదవోలు మండలకేంద్రాల్లో అంగన్వాడీలు జీవో నెం.2 ప్రతులను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గోపాలపురంలో సీఐటీయూ జెండాను ధరించి భోగిమంటల చుట్టూ తిరుగుతూ నినాదాలు చేశారు. డిమాండ్లు సాధించే వరకూ పోరాడతామని ప్రతిన బూనారు. పండుగ రోజున కూడా ఆందోళన చేసి తమ లక్ష్యం ఏమిటో చెప్పకనే చెప్పారు. కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు ఎన్.రామలక్ష్మి,కార్యకర్తలు పాల్గొన్నారు.



గోపాలపురంలో భోగిమంటల్లో జీవో 2 ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం

కొవ్వూరు, జనవరి 14: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవి, రంగనాథుల తిరుకల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. బసివిరెడ్డి పేట కల్యాణ వేంకటేశ్వర స్వామి, గోష్పాదక్షేత్రంలోని సుందర గోవిందుడు, పాతవూరులో వరద గోపాలస్వామి, స్థానిక శ్రీనివాసపురంలో ఐశ్వర్యలక్ష్మి గోదా సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో గోదా కల్యాణాలను నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

దేవరపల్లి: దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదారంగనాథుల కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించారు. గోదారంగనాథ స్వామి కల్యాణ నృత్యరూపకం అలరించింది. ఆలయ కమిటీ ఛైర్మన్ అంబటి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కొవ్వూరులో వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



దేవరపల్లిలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం